క్లుప్తంగా

పంటల సాగుపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రైతులు సాగు చేసే వివిధ రకాల పంటలు, సాగు చేసే పద్ధతులపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. సోమవారం కోడుమూరులోని నాగార్జున హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ, సీతాఫలం, దానిమ్మ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ పంట సాగు చేసే సమయంలో రైతులు పాటించే పద్ధతులు, పంట సాగు చేసిన తర్వాత తీసుకునే జాగ్రత్తలు, ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు నాగార్జున యాదవ్, ఎద్దుల సూర్యరెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

10 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' మండలస్థాయి పోటీలు

గడివేముల: ఈ నెల 10వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సచివాలయం స్థాయి నుంచి మండల స్థాయికి 112 జట్లు చేరుకున్నాయని వెల్లడించారు. వాలీబాల్ 28, కబడ్డీ 28, క్రికెట్‌కు 28, బ్యాడ్మింటన్ పోటీలకు 14, ఖోఖోకు 14 జట్లు ఎంపికై నట్లు తెలిపారు. మండల కేంద్రమైన గడివేములతో పాటు గని, కరిమద్దెల, గడిగరేవుల జెడ్పీ హైస్కూల్స్‌లో మండలస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఈ ఖలీల్ పాషా సోమవారం తెలిపారు. గ్రామంలో కొన్ని స్తంభాలు బాగలేకపోడంతో మార్పు చేస్తున్నామని, అలాగే తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు సి.బెళగల్‌లో వైద్య శిబిరం

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం సి.బెళగల్ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని గ్రామంలోని పాత బస్టాండ్ ఆవరణలో సి.బెళగల్ గ్రామ సచివాలయం-1లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరం ఏర్పాట్లను ఈఓఆర్డీ సందీప్ పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

12 మందికి ఫిజియోథెరపీ



దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు వీరేష్

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపులో 12 మందికి వ్యాయామం చేయించినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎంఈఓ వైద్యుడు వీరేష్‌ను అడిగి దివ్యాంగుల వైద్య విధానాలను తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేకంగా వైద్య సేవలను మండల కేంద్రంలో అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్‌టీలు మద్దిలేటి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న హంపి పీఠాధిపతి రాక

కోడుమూరు రూరల్ : ఈనెల 22వ తేదీన హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి కోడుమూరుకు విచ్చేయనున్నట్లు భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరులో దాతల సహకారంతో రూ.10కోట్ల వ్యయంతో పునర్నిర్మిస్తున్న పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి ఉత్తర ద్వారాన్ని పీఠాధిపతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

రోడ్లు వేశారు.. అవస్థలు తప్పించారు

- పాణ్యం నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు చక్కటి బీటీ రోడ్లు
- రెండేళ్ల వ్యవధిలో 80 శాతం గ్రామాలకు కొత్త రహదారులు
- నూతన బ్రిడ్జీల నిర్మాణం
- దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు



నాడు అనుపూరు కొర్రవాగుపై కల్వర్టు దుస్థితి



నేడు కొర్రవాగుపై నిర్మించిన బ్రిడ్జి



పాణ్యం : ఎన్నో ఏళ్లుగా గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడ్డ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరటనిచ్చింది. గ్రామాలకు హైవే మాదిరిగా రోడ్లు వేయించడంతో రాకపోలకు ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలో పాణ్యం నియోజకవర్గంలో దాదాపుగా 80 శాతం వరకు గ్రామాలకు కొత్త రోడ్లు వేశారు. అంతేకాక భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను గుర్తించిన అధికారుల మరమ్మతులు చేపట్టారు.

పాణ్యం మండలంలో రోడ్ల నిర్మాణం..

పాణ్యం మండలంలో మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య రూ.2 కోట్లు, కొణిదేడు–కొత్తూరు రూ.1కోటి 80 లక్షలు, తొగర్చేడు–ఉడుమల్పూరం రూ.70 లక్షలు, పాణ్యం–బనగానపల్లె రోడ్డు రూ.2 కోట్లా 35లక్షలు, గోనవరం–బలపనూరు రూ.2 కోట్ల 60లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అలాగే వరద ప్రవాహం వలన దెబ్బతిన్న పిన్నాపురం బ్రిడ్జిని రూ.85లక్షలతో పునర్నిర్మించారు. ఈ వాగుపై కల్వర్టు ప్రతి ఏటా వర్షకాలంలో కొట్టుకుపోవడంతో పిన్నాపురం– పాణ్యం గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయేవి. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గెలిచిన తర్వాత బ్రిడ్జిని నిర్మించారు. అలాగే మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వాగుపై రూ.85లక్షలతో కల్వర్టు పూర్తి చేశారు. తక్షణ మరమ్మతుల కింద భూపనపాడు గ్రామ పరిధిలోని సీసీ రోడ్డుకు రూ.20లక్షలు, మద్దూరు పీహెచ్‌సీ రోడ్డుకు నాడు–నేడు కింద రూ.67.25లక్షలు చొప్పున కేటాయించారు.

రూ.2 కోట్లతో బుజునూరుమెట్ట – పెసరవాయి రహదారి

గడివేముల మండలంలో మంచాలకట్ట గ్రామానికి రూ.20లక్షలతో రోడ్డు పనులు పూర్తి చేశారు. అలాగే ఐదేళ్లుగా బుజునూరుమెట్ట– పెసరవాయి గ్రామాల మధ్య రోడ్డు పూర్తి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ఇటీవల రూ.2కోట్లతో రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపారు.



నాడు రామతీర్థం-కందికాయపల్లె గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి



నేడు నూతనంగా వేసిన రోడ్డు

నన్నూరు నుంచి బస్తిపాడుకు రోడ్డు

కల్లూరు మండలంలోని పలు గ్రామాలకు కొత్త రోడ్లు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కె. నాగలాపురం –బస్తీపాడు, చిన్నటేకూరు మీదుగా నన్నూరుకు రూ.1.65కోట్లతో రోడ్డును నిర్మించారు. అలాగే కల్లూరు అర్బన్ పరిధిలో ఈద్గా నుంచి చెన్నమ్మ సర్కిల్ వరకు రూ.70లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. తాజాగా నన్నూరు నుంచి బస్తిపాడు వయ చిన్నటేకూరు మీదుగా ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేసేందుకు రూ.22.50కోట్లు మంజూరయ్యాయి.

హైవేను తలపించేలా రోడ్డు



రామతీర్థం–కందికాయపల్లె గ్రామాల మధ్య సరైన రోడ్డు లేదు. రోడ్డు మొత్తం కొండపై, అధికంగా మలుపులు ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడే వారం. గతంలో అనేక సార్లు అధికారులు అర్జీలు ఇచ్చాం. కానీ ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. 2019లో గెలిచిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా కొన్ని నెలల వ్యవధిలోనే మా గ్రామ రహదారి హైవే రోడ్డు మాదిరిగా తయారైంది. కొండప్రాంతాల్లో చక్కటి రోడ్డును రూ.50లక్షలతో నిర్మించారు.

– రామచంద్రుడు, సర్పంచ్, కందికాయపల్లె, పాణ్యం మండలం

బీసీ హాస్టల్‌లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ వెనుబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వసతిగృహ సంక్షేమ అధికారి (హెచ్‌డబ్ల్యూఓ) రమేష్ సోమవారం హాస్టల్ విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

కల్లూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సోమవారం కల్లూరు అర్బన్ స్వామిరెడ్డి నగర్ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఈఓలు కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి బహుమతులు అందజేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో క్రీడాకారులకు ఎంపీపీ బొంతల మునెప్ప క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం – 2 లో ఆడుదాం ఆంధ్ర క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై టీషర్టు, క్యాప్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, ఈఓఆర్డీ సందీప్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మహానంది, రఘురెడ్డి, బసయ్య తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో నిర్వహించనున్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం తన కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులతో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో స్మృతి వన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు వెచ్చించి 125 అడుగుల ఎత్తుతో దేశంలోనే ఎక్కడ లేని విధంగా 19 ఎకరాల్లో రాజ్యాంగ నిర్మాణ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికోసం కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులతో పాటు, స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పదవుల్లో రిజర్వేషన్ కన్నా అధిక స్థానాలు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దుక్కుతుందన్నారు.

ప్రతిపక్షాలవి నిరాధార ఆరోపణలు

ప్రతిపక్షాలు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తోందని, ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఒకరి మెప్పు కోసం పని చేసే వ్యక్తిని కాదని, న్యాయం కోసం పని చేస్తానని చెప్పారు. గోరుకలు రిజర్వాయర్ కట్ట నిర్మించడంతో పాటు 7 టీఎంసీల నుంచి 11 టీఎంసీలకు సామర్థ్యం పెంచామన్నారు. ఆయకట్టు కింద రెండో పంటకు నీరు అందిస్తున్నామన్నారు. గత పాలకులు రిజర్వాయర్‌కు షటర్లు కూడా నిర్మించలేదని గుర్తు చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డుల్లో 220 కోట్లతో ప్రాధాన్యతలను అనుసరించి వివిధ అభివృద్ధి పనులు చెపట్టామన్నారు. కృష్ణనగర్ ఐటీసీ సర్కిల్, చెన్నమ్మ సర్కిల్‌లో ఫ్లై ఓవర్లు, అలాగే వెంకటరమణకాలనీలో నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేశామని చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హుస్సేన్‌బీ, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు సుకుమార్, యూనస్, మునిస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు సహించం

- దమ్ముంటే ఆక్రమణలను నిరూపించండి
- మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ఓర్వకల్లు: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇటీవల పాలకొలను గ్రామంలో టీడీపీ నాయకులు చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తూ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడుతో కలిసి మార్కెట్ యార్డ్ చైర్మన్ మాట్లాడారు. తమ కుటుంబానికి ఎన్ని ఇబ్బందులు వచ్చినా గౌరు కుటుంబంతో కలిసే ప్రసక్తిలేదన్నారు. రాంభూపాల్‌రెడ్డి కుటుంబం వెంటే ఉంటామని తేల్చి చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిన కొందరు చీడపురుగులు మాట్లాడినంత మాత్రాన తాము భయపడేదిలేదన్నారు. స్థలాలు కబ్జాలు చేసినట్లు నిరూపిస్తే కొండారెడ్డి బురుజుకు ఉరేసుకుంటానని, మీ అవినీతి అక్రమాలను నిరూపిస్తే మీరు కూడా ఉరేసుకోవడానికి సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. సభలు, సమావేశాలలో సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడడం టీడీపీ వారికే చెల్లుతుందన్నారు. టీడీపీ నాయకులు, పాలకొలను సుధాకర్‌రెడ్డి, గుట్టపాడు సర్పంచు మోహన్ రెడ్డి చేసిన అవినీతి అక్రమాల చిట్టాలను పరిశీలిస్తే చాలావుందని, కానీ తమకు సభ్యత సంస్కారం ఉంది కాబట్టే మాట్లాడడం లేదన్నారు. రాజకీయాల్లో పార్టీలు మారడం స్వలాభాల కోసమేనని, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పుణ్యంతోనే సుధాకర్‌రెడ్డి ఆర్థికంగా ఎదిగిన విషయం మరిచి పోరాదని, అనవసరంగా వ్యక్తిగత దూషణలు చేయడం మంచిదికాదని జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు హితవు పలికారు. అసలు ఎమ్మెల్యేను విమర్శించేస్తాయి సుధాకర్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. తాము ఇళ్ల పట్టాలు అమ్ముకున్నట్లు నిరూపిస్తే 7 ఎకరాల సొంత భూమిని ధారాదత్తం చేస్తామని ఓర్వకల్లు సర్పంచు నాగేశ్వరమ్మ సవాల్ విసిరారు. అనవసరంగా తమపై బురద చల్లడం మంచిదికాదన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలనుకునే వారు ఇలా తప్పుడు ఆరోపణలు చేయరని తిప్పాయపల్లె హరినాథ్‌రెడ్డి, శకునాల పుల్లారెడ్డి అన్నారు. అనంతరం పాలకొలను సుధాకర్‌రెడ్డి పార్టీ మారడంతో పీడ విరుగుడైందని గ్రామస్తులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. సమావేశంలో ఎంపీపీ తిప్పన్న, ఎంపీటీసీ సభ్యులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, నాయకులు పాలకొలను వెంకటరామిరెడ్డి, కాల్వ వెంకటేశ్వర్లు, నూర్‌అహ్మద్, కొంతలపాడు మద్దయ్య, శంకర్‌రెడ్డి, గుర్రాల చెన్నారెడ్డి, కొమరోలు నాగశేషులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కోడుమూరు రూరల్ : స్పందనలో భాగంగా ప్రజల నుంచి వచ్చే సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జయన్న సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. శ్మశానానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, స్థలాన్ని చూపాలంటూ కోడుమూరులోని కొండపేటకు చెందిన బుడబుక్కల కులస్తులు అర్జీ సమర్పించగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం పుష్పావతి, ఎంఈఓ శరభయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు రైతులు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి,సి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతులు భూ రీ సర్వేలో భాగంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణికి అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ తదితరులు ఉన్నారు.

గూడూరు: స్పందనలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ అధికారులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రాముడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసనాయక్, పీఆర్ ఏఈ గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు సోమవారం ప్రాజెక్టు అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.661 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో బజారమ్మ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాధవి

సి.బెళగల్: మండలంలోని ఈర్లదిన్నె గ్రామానికి చెందిన వృద్ధురాలు బజారమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యం గురై చికిత్స కోసం కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఈర్లదిన్నె గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్ మాధవి సోమవారం కర్నూలుకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకుంటున్న బజారమ్మకు పింఛన్ అందజేశారు.

పార్కులను ఏర్పాటు చేయాలి

కల్లూరు: పార్కులను ఏర్పాటు చేయాలని కల్లూరు అర్బన్ నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం కాలనీ ఇంటి యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.నాగరాజు ఆధ్వర్యంలో కాలనీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేసి ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం



గూడూరులో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

గూడూరు: ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి తెలిపారు. రాష్ట్రోపాధ్యాయ (ఎస్టీయూ) సంఘం ఏర్పడి 75 వసంతాలు పూర్తియిన సందర్భంగా సోమవారం ఆ సంఘం ఉపాధ్యాయులు పట్టణంలో మొక్కలు నాటి సంబరాలు జరుపుకున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడూరు, గుడిపాడు, పెంచికలపాడు గ్రామ హైస్కూల్‌లలో మొక్కలు నాటినట్లు తెలిపారు. 12, 13 తేదీల్లో కర్నూలు మున్సిపల్ గ్రౌండ్ నందు వజ్రోత్సవ సంబరాలు జరుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.సురేష్‌బాబు, వై.నారాయణమ్మ, పి. సాయిలీల, హనుమంతురెడ్డి, కే.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

100 శాతం పింఛన్ల పంపిణీ

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గ్రామాలన్నింటిలో వివిధ రకాల పింఛన్ల పంపిణీ సోమవారంతో 100 శాతం పూర్తి అయ్యింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను విడతల వారీగా రూ.3 వేలకు పెంచారు. పెంచిన పింఛన్ కానుకలను ఈ నెల 6న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదే విధంగా కొత్తగా మంజూరైన పింఛన్లను సైతం అందజేశారు. మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో 10,326 మందికి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, ఒంటరి మహిళ, ట్రాన్స్‌జెండర్స్‌కి పింఛన్లు, కొత్తగా 158 మందికి పింఛన్లు పంపిణీ చేశారు.



బి.తాండ్రపాడు సచివాలయం-2 పరిధిలోని పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ మోహన్‌బాబు

'డప్పు పండుగ'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

కల్లూరు: ఈ నెల 10 నుంచి 13 వరకు జిల్లాలో జరిగే డప్పు పండుగ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్రం అధ్యక్షుడు ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీడీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు, జిల్లా నాయకులు చక్రపాణి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. జనవరి 10, 11న కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు సంబంధించిన డప్పు పోటీలను పెద్దపాడులో, 12, 13న గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, కౌతాళం మండలాలకు సంబంధించిన డప్పు పోటీలను ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, దాసు, రాముడు, యేసు, చిరంజీవి, మద్దిలేటి, రత్నం, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: మండల ప్రజలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రం సి. బెళగల్‌లో పర్యటించి, గ్రామ పరిశుభ్రత, సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో డెంగీ అనుమానిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య రక్షణ చర్యలు, వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

మెట్లను తొలగించిన తరువాతే రోడ్డు వేయాలి

కోడుమూరు రూరల్ : పట్టణంలోని బళ్లారి రోడ్డులో బట్టల అంగళ్ల మధ్య ఉన్న రస్తాలో అడ్డుగా ఉన్న ఇనుప మెట్లను తొలగించేంత వరకు తమ కాలనీలో రోడ్డు వేయరాదంటూ కాలనీవాసులు సోమవారం రోడ్డు పనులను అడ్డుకున్నారు. రస్తాకు అడ్డుగా బట్టల అంగడి యజమాని ఇనుప మెట్లను వేయడంతో తమ ఇళ్ల వద్దకు వాహనాలు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్లను తొలగించాలని చాలా రోజులుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రస్తాకు అడ్డుగా ఉన్న మెట్లను తొలగించిన తర్వాతే తమ కాలనీకి రోడ్డు వేయాలని స్పష్టం చేశారు.